సాక్షి వికారాబాద్

శనివారం । 7 । అక్టోబర్ । 2023



చేదెక్కిన చెరుకు సాగు

చెరుకు పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. పెట్టుబడులు పెరుగుతున్నా మద్దతు ధర లేక నష్టపోతున్నారు. 8లో▸



ప్రయాణం.. నరకప్రాయం

దౌల్తాబాద్ మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



నిరసన గళం

ఆరు నెలలుగా బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే కాలె యాదయ్య



సర్పంచులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. నవాబుపేట ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండలంలోని పంచాయతీ సర్పంచులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పరికరాలు అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, తహసీల్దార్ బీ.జయరాం, ఎంపీడీవో సుమిత్రమ్మ, సర్పంచులు జయలక్ష్మి, అనిత, సుధాకర్‌రెడ్డి, రత్నం, నాయకులు నాగిరెడ్డి, రంగారెడ్డి, దయాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రకాశం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు క్రీడా సామగ్రి

అందజేసిన డీపీఓ తరుణ్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులకు జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ క్రీడా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేసిన క్రీడా సామగ్రిని యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


104 ఉద్యోగులకు కాంగ్రెస్ నేతల సంఘీభావం



104 ఉద్యోగుల దీక్ష శిబిరం వద్ద కాంగ్రెస్ నేతలు

అనంతగిరి: హక్కుల సాధన కోసం వికారాబాద్‌లో నిరవధిక సమ్మె చేస్తున్న 104 ఉద్యోగులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. మాజీ మంత్రి ప్రసాద్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత మనోహర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. 104 ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుకారాం, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా సంగీత



సంగీతకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: బీఆర్ఎస్ తాండూరు పట్టణ మహిళా అధ్యక్షురాలిగా 20వ వార్డు కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ నియమితులయ్యారు. శుక్రవారం ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. మహిళా విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పట్టణంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

దళితబంధు చెక్కుల పంపిణీ

తాండూరు: పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శుక్రవారం మంత్రి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం బీసీ సామాజిక వర్గంలోని 16 కులాలకు చెందిన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. పలువురు దళితబంధు లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున పంపిణీ చేశారు. మైనార్టీ బంధు కింద రూ.లక్ష అందజేశారు. బీసీ బంధులో భాగంగా 200 మందికి చెక్కులు అందించారు.

ఉపాహారం.. వరం



శివారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాహారం పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్

రాష్ట్రంలో విద్య, వైద్య రంగానికి పెద్ద పీట

- 'మనఊరు – మనబడి'తో గుణాత్మక మార్పులు
- మంత్రి మహేందర్‌రెడ్డి
- శివారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాహార పథకం ప్రారంభం

వికారాబాద్: సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని, ఆయన ఏది చేసినా అందులో పేదల అభ్యున్నతి దాగి ఉంటుందని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉపాహారం పథకాన్ని ఆయన కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల,ఎంపీపీ చంద్రకళతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. టిఫిన్ ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ శాతం పేద విద్యార్థులే ఉంటారని, ఉదయం వారు ఉపాహారం తీసుకోకుండానే పాఠశాలలకు వస్తుంటారని తెలిపారు. వారిని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఇకపై ప్రతి రోజూ ఉదయం పాఠశాలల ప్రారంభానికి ముందు విద్యార్థులకు ఉపాహారం అందిస్తారని తెలిపారు. ఇప్పటికే మధ్యాహ్న భోజనం అందుతోందని తెలిపారు. ఈ పథకం పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉపాహారం విద్యార్థుల ఆరోగ్యానికి వరమని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలోని 1,051 పాఠశాలల్లో 92వేల మంది విద్యార్థులకు ఈ పథకం అమలు కానున్నట్లు తెలిపారు. ఉపాహారం పథకం చారిత్రాత్మకమైనదని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో విద్య, వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. మన ఊరు మన బడి కార్యక్రమంతో పాఠశాలల్లో గుణాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన ఘన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

తాండూరు రూరల్: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు మండలం జినుగుర్తి సమీపంలో రూ.18 కోట్లతో నిర్మించిన మైనార్టీ వెల్ఫేర్ స్కూల్, హాస్టన్‌ను స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాండూరు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బంజార భవన్, ఆటో నగర్, లారీ పార్కింగ్, పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనితగౌడ్, జెడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమా శంకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, లారీ ఓనర్స్ నాయకులు అబ్దుల్ గని, నర్సింహారెడ్డి, అంతారం సర్పంచ్ రాములు, ఎంపీటీసీ శాంతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పత్తి కొనుగోలుకు సిద్ధం కండి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: రైతులకు ఇబ్బంది కలగకుండా పత్తి పంటను కొనుగోలు చేయాలని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2,88లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోనే మన జిల్లా పత్తి ఉత్పత్తిలో ఐదో స్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో పత్తి కొనుగోలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిన్నింగ్ మిల్లుల వద్ద అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. రైతులు బ్యాంక్ ఖాతాలకు ఆధార్ నంబరును అనుసంధానం చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. మిల్లుల వద్ద ఏర్పాటు చేసే తూకం యంత్రాలను పరిశీలించాలని తూనికలు కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ డిపార్ట్‌మెంట్ శాఖ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మిల్లుల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు, రవాణా శాఖల అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, విద్యుత్, రవాణా, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు

తుర్కయంజాల్: వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం విధిగా నిర్వహించి అర్హులైన చిన్నారులకు తప్పక ఇప్పించాలని, వారి ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని జిల్లా వైద్యాధికారి డా. వెంకటేశ్వర్ రావు సిబ్బందిని ఆదేశించారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా రెండు నెలలుగా ఐదేళ్లలోపు పిల్లలకు గతంలో ఏవైనా టీకాలు తీసుకోని వారిని గుర్తించి ఇప్పించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా బస్తీలు, వలస కార్మికులు నివసించే ప్రాంతాల్లోని పిల్లలకు టీకాలు వేయాలని సూచించారు.



డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ హవా

- సీఎం కేసీఆర్‌కు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో గండం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్
- కాంగ్రెస్‌లో చేరిన డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

తాండూరు: సీఎం కేసీఆర్‌కు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో గండం పొంచి ఉందని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీమంత్రి మాట్లాడారు. పక్షం రోజులుగా సీఎం కేసీఆర్ బయట కనిపించడం లేదని, కొడుకు, అల్లుడు కలిసి ముఖ్యమంత్రిని ఎందుకు బయటకు రానియ్యడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో హస్తం హవా కొనసాగుతోందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆ తరువాత 6 గ్యారంటీ స్కీమ్‌లు అమలు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికల హామీల అమలులో ఘోరంగా విఫలమైనట్లు తెలిపారు. నేటికీ కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తోందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అలీం, తాండూరు పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంపత్‌కుమార్, ప్రభాకర్‌గౌడ్, నగేష్, బస్వరాజ్, సర్దార్‌ఖాన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఆగిన బదిలీలు

- ట్రాన్స్‌ఫర్ల కోసం ఉపాధ్యాయుల ఎదురుచూపులు
- జోన్–1లో కొనసాగుతున్న ప్రక్రియ
- కోర్టు కేసులతో జోన్ –2లో ఆగిన వైనం
- ఇబ్బందుల్లో 3వేల మంది టీచర్లు



వికారాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. బదిలీల ప్రక్రియ గత నెల 3న ప్రారంభమైనా కోర్టు కేసులతో ఆగాయి. ఎప్పుడు ఏ విషయంపై కోర్టు స్టే ఇస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల వాట్సాఫ్ గ్రూపుల్లో పూటకో సమాచారం వస్తుండటం వారిని మరింత గందరగోళానికి గురిచేస్తోంది. మిగతా జోన్లలో బదిలీలు కొనసాగుతుండగా జోన్ –2లో మాత్రం బ్రేక్ పడింది. జోన్ –2ను మల్టీజోన్‌గా ఏర్పాటు చేయడంతో స్థానికులకు నష్టం జరుగుతుందని కొందరు కోర్టును ఆశ్రయించారు. అంతేకాకుండా, ప్రమోషన్లు ఇచ్చే విషయంలో వన్ ఇస్టు త్రీ కాకుండా వన్ ఇస్టు టూ మాత్రమే పిలిచారని మరికొందరు కోర్టును ఆశ్రయించారు. టెట్ లేకుండా స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ ఎలా ఇస్తారంటూ మరో కేసు వేశారు. విద్యాశాఖ ఇవన్నీ సర్దుబాటు చేస్తూ బదిలీల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయగా తాజాగా శుక్రవారం కోర్టు మరో సారి స్టే ఇవ్వడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన మరింత పెరిగింది. పదోన్నతులు ఇచ్చాకే బదిలీలు చేయాలంటూ కోర్టు స్టే ఇచ్చింది. ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం శుక్ర, శని వారాల్లో చేపట్టిన వెబ్ ఆప్షన్స్‌పై కూడా కోర్టు స్టేతో బదిలీలపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేవలం జీహెచ్‌ఎంల బదిలీలు మాత్రమే పూర్తయ్యాయి. ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్లకు, జీహెచ్‌ఎంల ప్రమోషన్లు పూర్తి కావడంతో పాటు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీల బదిలీలు పూర్తి కావాలి. కానీ కోర్టు కేసుల కారణంగా బ్రేక్ పడింది. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే బదిలీలు అవుతాయా కావా అనే అనుమానం ఉపాధ్యాయులను వెంటాడుతోంది.

హెచ్ఆర్ఏ కోసమే..

మల్టీజోన్ –2 పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో చాలా కాలంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు హెచ్ఆర్ఏ వస్తుందనే ఉద్దేశంతోనే తరుచూ కోర్టుకు వెళ్లి బదిలీలకు ఆటంకం కలిగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధిక హెచ్ఆర్ఏ తీసుకుంటూ నగర జీవితానికి అలవాటు పడి ఇతర ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని మారుమూల మండలాలైన దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్ వంటి మండలాల్లో పది, పన్నెండేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. జోనల్ –1లో ఇప్పటికే అన్ని రకాల బదిలీలు పూర్తి కాగా జోనల్ –2లో హెచ్ఆర్ఏ కారణంగానే బదిలీలు ఆగుతున్నాయనే ప్రచారం ఉంది.

98 పాఠశాలలకు జీహెచ్‌ఎంలు లేరు

జిల్లాలోని ఉన్నత పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉంది. ఇటీవల జరిగిన జీహెచ్‌ఎంల బదిలీల్లో కేవలం 47 మంది మాత్రమే ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు వెళ్లారు. వీరు కాకుండా 98 ఉన్నత పాఠశాలలు జీహెచ్‌ఎంలు లేరు. స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు ఇస్తే జీహెచ్‌ఎం పోస్టులు పూర్తిగా భర్తీ అయ్యే అవకాశం ఉంది. తొమ్మిదేళ్లుగా స్కూల్ అసిస్టెంట్లు.. జీహెచ్‌ఎం పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు.

బదిలీల కోసం..

జిల్లాలో 3,167 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. ఇందులో ఎస్జీటీలు 1,612 మంది ఉండగా, మిగతా వారు స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు. 317 జీవోలో వచ్చిన వారు సైతం బదిలీల కోసం వేచి చూస్తున్నారు. వీరంతా జిల్లాలోని మారుమూల మండలాలైన బషీరాబాద్, యాలాల్, కొడంగల్ వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. ఫోస్ అవకాశం లేక కూడా చాలా మంది భర్త హైదరాబాద్‌లో పనిచేస్తుండగా భార్య వికారాబాద్‌లోని మారుమూల మండలాల్లో పనిచేస్తున్నారు. ఇలా అత్యధిక మంది ఉపాధ్యాయులు పలు రకాలుగా ఇబ్బందులు పడుతుంటే, కొందరు ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లి అందరికి ఇబ్బందులు తెచ్చి పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. శుక్రవారం నాటి కోర్టు స్టేతో ఉపాధ్యాయులు దాదాపుగా బదిలీలపై ఆశలు వదులుకున్నారు. రెండు మూడు రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తే వారి అనుమానం నిజం కానుంది.

స్వపరిపాలనతో గ్రామ స్వరాజ్యం

- చీమల్‌దరి గ్రామమే నిదర్శనం
- చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి



చీమల్‌దరిలో పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, సర్పంచ్

మోమిన్‌పేట: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్వపరిపాలనతో సాధ్యమవుతోందని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చీమల్‌దరి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని, రూ.3.60 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. స్వపరిపాలనతో చీమల్‌దరి మోడల్‌గా నిలిచిందన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంతో మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. చీమల్‌దరిలో పంచాయతీ నిధులతోపాటు సొంత వనరులు వినియోగించుకొని జాతీయ అవార్డును సొంతం చేసుకుందని తెలిపారు. నేడు గ్రామంలో ప్రజలకు అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. భూగర్భ మురుగు కాలువలు, విశాలమైన సీసీ రోడ్లు, బీఎస్ఎన్ఎల్ ఉచిత వై ఫై, సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. పంచాయతీ పాలకవర్గం, ప్రజల సహకారంతో గ్రామ రూపురేఖలే మారిపోయాయని తెలిపారు. చీమల్‌దరి గ్రామాన్ని అన్ని పంచాయతీలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన సర్పంచ్ నర్సింహారెడ్డి, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ డీ వసంత, ఉపాధ్యక్షురాలు మానస, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, ఎంపీడీఓ శైలజా రెడ్డి, ఎంపీఓ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి సుగుణ, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ గౌడు, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు అజీజ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరిశంకర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు అంజయ్య, సత్యనారాయణరెడ్డి, ఆశమ్మ, నాయకులు వెంకట్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం

- ముదిరాజ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు
- జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ సీట్లు కేటాయించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రావు

కొడంగల్ రూరల్: రాజ్యాధికారం సాధించే దిశగా ముదిరాజ్‌లు సంఘటితం కావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, సినీ నటుడు బిత్తిరి సత్తి (రవి) పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ముదిరాజ్ ఆత్మగౌరవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లను ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని ఆరోపించారు. తమకు సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రకటించిన 115 అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో ముదిరాజ్‌లకు చోటు లేకపోవడం దారుణమన్నారు. జనాభా ప్రాతిపదికన అన్ని పార్టీలు 18సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆ పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎన్నికల బరిలో నిలిచే ముదిరాజ్‌లను పార్టీలకతీతంగా గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లు సంఘటితంగా పోరాడినప్పుడే హక్కులు సాధించుకోగలమని పేర్కొన్నారు. ముదిరాజ్‌లను విమర్శిస్తే సహించేది లేదని ఆయన అన్నారు. అంతకుముందు పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర ఆలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ నాయకులు వెంకటయ్య, బాల్‌రాజ్, కూర వెంకటయ్య, రెడ్డి శ్రీను, సావిత్రి, హన్మంతు, బంటు రమేష్, సతీష్ ముదిరాజ్, కోట్ల మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: మున్నూరుకాపు విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు ఈ నెల 6వ తేదీ నుంచి నవంబర్ 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని మున్నూరుకాపు సంఘం నాయకులు శంకరప్ప, అనంతప్రసాద్, చంద్రశేఖర్, బిచ్చప్ప తదితరులు తెలిపారు. శుక్రవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో 90 శాతంపైగా మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అత్యాచార నిందితుడు అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని చిన్న నందిగామ గ్రామంలో మానసిక దివ్యాంగురాలి అత్యాచారం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్ననందిగామ గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ ఈ నెల 3వ తేదీన అదే గ్రామానికి చెందిన దివ్యాంగురాలిని అత్యాచారం చేశాడని బాధితురాలి తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాములు తెలిపారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

కుల్కచర్ల: రైతాంగ అభ్యున్నతి కోసం ప్రాథమిక సహకార సంఘాలు నిర్విరామంగా కృషి చేస్తున్నాయని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు అన్నారు. శుక్రవారం కుల్కచర్లలో నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం భవనానికి వాస్తుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ఆధ్వర్యంలో రుణ సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ వెంకటయ్య, మండల రైతుబంధు కమిటీ కో ఆర్డినేటర్ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



బంట్వారం: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశానని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఆయన కోట్‌పల్లి మండల పరిధిలోని కరీంపూర్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. జీపీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేశామన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. మహిళలకు బతుకమ్మ చీరలు, క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, పలువురికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ బందెయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో దివిటి అంజయ్య మృతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంకు చెందిన టీడీపీ నాయకుడు దివిటి అంజయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. దివంగత ఎన్టీఆర్ వీరాభిమానిగా టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో పనిచేశారు. టీడీపీ టౌన్, మండల స్థాయిలో వివిధ విభాగాల్లో పార్టీ పదవులు నిర్వహించారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు.

చేదెక్కిన చెరకు సాగు

- గిట్టుబాటు కాని పంట
- పెట్టుబడులు కూడా రాని వైనం
- ఫ్యాక్టరీ అందుబాటులో లేక రైతుల ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు
- దళారులే దిక్కు



పెద్దేముల్ మండలంలో సాగవుతున్న చెరకు

పెద్దేముల్: చెరకు రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. పెట్టుబడులు పెరుగుతున్నా.. మద్దతు ధర అందకపోవడంతో నష్టపోతున్నాడు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కూడా కరువవడంతో తీపిని పంచాల్సిన చెరకు సాగు రైతుకు చేదును పంచుతోంది. ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవటం లేదని వికారాబాద్ జిల్లాలోని పెద్దేముల్, బంట్వారం, కోటపల్లి, యాలాల, బషీరాబాద్‌తో పాటు పలు మాండలాల రైతులు వాపోతున్నారు. ఏడాది పాటు కష్టపడినా చివరకు పిప్పి తప్పా ఏమీ దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా చెరకు కర్మాగారం కోసం ఎదురుచూస్తున్నా.. ఏ ప్రభుత్వం తమ గోడును పట్టించుకోవడం లేదని విలపిస్తున్నారు.

దళారుల చేతివాటం

వికారాబాద్ జిల్లా పెద్దేముల్, కోటపల్లి, ధారూర్, మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారంతో పాటు పలు మండలాల్లో చెరకు పంటను సాగుచేస్తున్నారు. అందుబాటులో ప్రభుత్వ ఫ్యాక్టరీ లేక ప్రైవేట్ ఫ్యాక్టరీలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు యాజమాన్యం సాగు సమయంలో సకల మర్యాదలు చేసి, కోతల సమయంలో రైతన్నలకు చుక్కలు చూపిస్తోంది. యాద్గీర్, కొత్తకోట, సంగారెడ్డి ప్రాంతాలకు చెరకును తరలిస్తున్నారు. సంగారెడ్డిలోని గణేశ్ ఫ్యాక్టరీ యాజమాన్యం 50 కిలో మీటర్ల దూరం దాటితే టన్ను రూ.3,400 ధర చెల్లిస్తోంది. అందులో లేబర్, డ్రైవర్ బత్తాతో ఇతర ఖర్చులు పోతే టన్నుకు రూ.2,100 మిగులుతోందని రైతులు అంటున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ధరను పెంచుతామని ఫ్యాక్టరీ యాజమాన్యం హామీ ఇస్తోంది. కానీ కొతకు రాగానే ధర పెంచమని అడిగితే ముఖం చాటేస్తున్నారని రైతులు వాపొతున్నారు.

పెట్టుబడి కూడా దక్కడం లేదు

చెరకు ఏడాది పంట కావడంతో పెట్టుబడి కూడా ఎక్కువే. దీనికితోడు సమయానికి కూలీలు, ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎకరా చెరకు పంట సాగు చేయాలంటే సుమారు రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరాకు 40 నుంచి 50 టన్నుల పంట దిగుబడి వస్తే లాభం ఉంటుంది. కానీ 20 నుంచి 25 టన్నుల దిగుబడి మాత్రమే వస్తోందని చెబుతున్నారు. దీంతో పెట్టుబడి కూడా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలకుల వైఫల్యం



ప్రభుత్వాలు మారుతున్నా.. చెరకు రైతుల బతుకులు మారటం లేదు. జిల్లాలో చెరకు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని నాయకులకు, అధికారులకు వినతిపత్రాలిచ్చాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఫ్యాక్టరీ వస్తుందని అనుకున్నాం. ఈ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు.

– రామచంద్రయ్య రైతు, బండమీదిపల్లి

ఏడాది కష్టం మధ్యవర్తుల పాలు



ఏడాది పాటు చేసిన కష్టం మధ్యవర్తుల పాలవుతోంది. కోతల సమయంలో కూలీలు, యంత్రాలు అందుబాటులో లేక దళారులను ఆశ్రయించాల్సి వస్తుంది. ఫ్యాక్టరీల యజమానులు దళారులకు ఇస్తున్న ప్రాధాన్యత రైతులకు ఇవ్వడం లేదు.

– లాలప్ప, రైతు, బుద్దారం

షార్ట్ సర్క్యూట్‌తో చెరకు తోటలు దగ్ధం

- ఏడు ఎకరాల పంట దగ్ధం
- రూ.3 లక్షల ఆస్తినష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన చెరకు తోట

పెద్దేముల్: షార్ట్ సర్క్యూట్‌తో ఏడు ఎకరాల చెరకు తోట దగ్ధమైంది. పెద్దేముల్ మండలం పాషాపూర్ రెవెన్యూ శివారు అడ్కిచెర్ల గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, రాంరెడ్డి, మెల్ల మైబుబ్, మెల్ల హిమామ్‌తో పాటు పలువురు రైతులు పదేళ్లగా చెరకు పంటను సాగుచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ వలన అడ్కిచెర్ల గ్రామానికి చెందిన రాంరెడ్డి చెరకు పంటలో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న మరో ముగ్గురు రైతులు వెంకటరెడ్డి, మైబుబ్, హిమామ్ పొలాలకు మంటలు వ్యాపించాయి. మొత్తం ఏడు ఎకరాల పంట కాలి పోయిందని రైతులు చెబుతున్నారు. రూ.3లక్షలకు పైగా నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కేసీఆర్ సంకల్పంతోనే బతుకమ్మ చీరలు



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ మధుకర్

జెడ్పీటీసీ మధుకర్

మర్పల్లి: సీఎం కేసీఆర్ ఐదేళ్లుగా మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నారని జెడ్పీటీసీ మధుకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పట్లూర్, మర్పల్లి గ్రామాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ పండుగను జరుపుకోవాలనే కేసీఆర్ సంకల్పంతో చీరలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్, ఎంపీడీఓ మల్లయ్య, ఎంపీపీ లలిత, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఎంపీఓ మహేశ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

‘ఉపాహారం’ చాలా మేలు



మాట్లాడుతున్న ఏఎంఓ రామ్

కొడంగల్ రూరల్: విద్యార్థులకు అల్పాహార పథకం ఎంతో మేలు చేస్తుందని విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) రామ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జీసీపీఎస్ పాఠశాలలో ఉపాహార పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పథకాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మాజీ సర్పంచ్ రమేశ్ బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ రాంరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

నిరసన గళం

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని సమ్మె
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు

కొడంగల్ రూరల్: ఆరు నెలలుగా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోయారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తొమ్మిది రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకుండా కొత్త పథకాలు ప్రారంభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, కొత్తగా ప్రభుత్వం అల్పాహారం పథకం ప్రవేశ పెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు,సీఐటీయూ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసనలతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాల ఆవరణలో నిరసనలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికులకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రయాణం.. నరకప్రాయం

- జంకుతున్న జనం
- గుంతల ప్రయాణంతో చింత
- వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- కంకర తేలి ప్రమాదకరంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



గుముడాల-తిమ్మాయిపల్లి మధ్య కంకర తేలిన రోడ్డు

దౌల్తాబాద్: మండలంలో పలు రోడ్లపై ప్రయాణించాలంటనే వాహనదారులు, ప్రయాణికులు జంకుతున్నారు. కంకర తేలిన రోడ్డు.. పక్కనుంచి వాహనం వెళ్తంటే భయం.. గుంతల్లో నీరు...ఇలా భయంతో వాహనచోదకులు వణికిపోతున్నారు. ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి రోడ్లు వేస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేక చిన్నపాటి వర్షాలకే రోడ్లపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారుతున్నాయి. దీంతో రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మండలంలో....

మండలంలో బాలంపేట– అంతారం, దౌల్తాబాద్–బిచ్చాల గ్రామాల మధ్య ఉన్న రోడ్లు కంకర తేలి గుంతలు పడ్డాయి. ఏళ్ల కిందట నిర్మించిన ఈ రోడ్ల వైపు అధికారులు కన్నెత్తిచూడడంలేదు. ఈ రోడ్లపై రాకపోకలు సాగిస్తుంటే వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. మరోవైపు ప్రైవేటు వాహనదారులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

మనోహర్‌రెడ్డి రాజీనామా చేయాలి

- పీఏసీఎస్ చైర్మన్ల డిమాండ్



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్లు

తాండూరు టౌన్: బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి తక్షణమే చైర్మన్ పదవికి కూడా రాజీనామా చేయాలని తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాల పీఏసీఎస్ చైర్మన్లు రవిగౌడ్, సురేందర్ రెడ్డి, వెంకట రాంరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో వారు విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న మనోహర్‌రెడ్డిని బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశాలతో ఏకగ్రీవంగా డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నుకున్నామని తెలిపారు. పార్టీకి ద్రోహం చేసిన ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. స్వలాభం కోసం ఇతర పార్టీలోకి వెళ్లడం సమంజసం కాదని హితవుపలికారు.

మహిళ మృతి



చెన్నమ్మ (ఫైల్)

దోమ: ప్రమాదవశాత్తు ఒంటికి నిప్పంటుకొని ఓ మహిళా మృతి చెందింది. ఈ సంఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. లింగస్‌పల్లి గ్రామానికి చెందిన చెన్నమ్మ (49) వంట చేసేందుకు కట్టెల పొయ్యిని పెట్రోల్‌తో అంటించింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి చీరకు అంటుకున్నాయి. మంటల్లో చిక్కుకున్న భార్యను కాపాడేందుకు భర్త అంజిలయ్య ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు చెన్నమ్మను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలతో ఉన్న ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకుపోవాలని వైద్యులు సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజనబంధు కాంగ్రెస్‌కే సాధ్యం

ఆ పార్టీ నాయకుడు తిరుపతిరెడ్డి



బంజారా భేరిలో తిరుపతిరెడ్డి తదితరులు

బొంరాస్‌పేట: గిరిజనుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు తిరుపతిరెడ్డి అన్నారు. దుద్యాల మండలంలోని చెట్టుపల్లితండాలో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖరయ్య అధ్యక్షతన బంజారా భేరి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గిరిజనబంధు కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో గిరిజనులు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముద్దప్ప దేశ్‌ముఖ్, సీసీ వెంకటయ్య, ప్రశాంత్, నర్సింహ తదితరులున్నారు.

తాండూరుకు మరో కోర్టు

తాండూరు: తాండూరులో మరో కోర్టు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు శుక్రవారం న్యాయ శాఖ జీఓ నంబర్ 60ను జారీ చేసింది. ప్రస్తుతం తాండూరులో ఉన్న జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ (జేఎంఎఫ్‌సీ) న్యాయస్థానాన్ని ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టుగా మార్చారు. అంతేకాకుండా తాండూరు కోర్టు ప్రాంగణంలో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టును మంజూరు చేసింది. దీంతో ఒకే కోర్టు ప్రాంగణంలో రెండు న్యాయస్థానాలు ఉండటంతో ఇద్దరు న్యాయమూర్తులు అందుబాటులో ఉంటారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న 5 పోలీస్ స్టేషన్లను విభజించి న్యాయసేవలను అందించనున్నారు.

మంత్రికి వినతి



మంత్రి మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

తాండూరు టౌన్: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి శుక్రవారం తాండూరులో ఆశ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ నియోజకవర్గ అధ్యక్షురాలు రాజమణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశలకు కనీస వేతనంగా రూ. 18 వేలు చెల్లించాలన్నారు. హెల్త్ కార్డులు అందజేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు సుజాత, శ్రీదేవి, రమాదేవి, అంజమ్మ, సరిత, లలిత, రాజేశ్వరి, మున్ని, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చాటుతాం

బీఎస్పీ వికారాబాద్ అభ్యర్థి క్రాంతికుమార్



మాట్లాడుతున్న క్రాంతికుమార్

అనంతగిరి: వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని బీఎస్పీ వికారాబాద్ అభ్యర్థి క్రాంతి కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తనకు వికారాబాద్ టికెట్ ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. వికారాబాద్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఈ సారి బీఎస్పీని ఆదరిస్తారని అన్నారు. నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలోనే అధికార పార్టీ నేతలకు వికారాబాద్ అభివృద్ధి గుర్తుకు వస్తుందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నాలుగున్నర ఏళ్లుగా చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాల అందజేత



విద్యాభవన్ ప్రతులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ఆర్థికంగా వెనుకబడిన తరగతి(ఈబీసీ) విద్యాభవన్ నిర్మాణానికి ఎకరం భూమి కేటాయిస్తూ, భవన నిర్మాణానికి రూ. 25 లక్షల నిధులు మంజూరు చేసిన ప్రొసీడింగ్ కాపీలను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, రెడ్డి జాగృతి సంఘం నాయకులకు అందజేశారు.

వికారాబాద్‌లో..

వికారాబాద్‌లోని ముత్యాల ధర్మశాలకు ఏడాది కాలం పాటు దేవాదాయ శాఖ నుంచి పన్ను మినహాయింపు చేస్తూ జారీ చేసిన జీవో పత్రాలను ఆనంద్ శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో శుక్రవారం ఎన్టీఆర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోటాపోటీగా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే ఆనంద్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయగా.. అందుకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ సభలో ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మరోసారి ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదన్నారు.